


# మనం మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల, నారాయణ పేట, వనపర్తి

గురువారం | 15 | అక్టోబర్ | 2026 | పేజీలు 13 | www.manamepaper.com


# తాగునీటి కొరత ఉండొద్దు

**ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించుకునేలా అవగాహన**

**ఎల్‌నినోతో అప్రమత్తంగా ఉండాలి**

**ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాలు ఉన్న గిరిజన రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు**

**అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి తీరాలి**

**లాభదాయకమైన పంటల సాగుపై గిరిజన రైతులకు అవగాహన కల్పించాలి**

**జిల్లా ఉన్నతాధికారుల సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ**

ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 14 (మనం బ్యూరో) : ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో ప్రజలకు తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సంభందిత అధికారులను ఆదేశించారు. జిల్లాలోని రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటిని సమర్ధంగా వినియోగించుకోవాలన్నారు. అవసరమైన చోట్ల చెరువులు, కుంటలను నింపే చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి నీటి

- మిగతా 2లో..



# ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

**అంకిరావుపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల్లో మంత్రి జూపల్లి**

**అంకిరావుపల్లి గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించారు. నూతన గృహాల్లోకి అడుగుపెట్టిన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేద కుటుంబాలకు సొంతింటి సౌకర్యం కల్పించేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని అన్నారు.**

కొల్లాపూర్ 15 అక్టోబర్ (మనం న్యూస్) : సొంతింటి ద్వారా పేద కుటుంబాలకు భద్రత, భరోసా కల్పించడం తో పాటు వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు ఈ పథకం దోహదపడుతోందని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. మహిళలు, రైతులు, పేద కుటుంబాల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

**బంధువులైనా.. మేనమామలైనా చట్టం ముందు అందరూ సమానులేనని ఎమ్మెల్యే మేఘారెడ్డి పునరుద్ఘాటించారు. పెద్దమందడి మండలంలోని తన స్వగ్రామం మంగంపల్లిలో ఆంజనేయస్వామి ఆలయంలోకి వెళ్లి వచ్చిన దళిత యువకుడు సుధీర్ పట్ల కొందరు వ్యక్తులు దురుసుగా ప్రవర్తించిన తీరుపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఓ ప్రైవేట్ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన స్పందిస్తూ.. చట్టం ముందు అందరూ సమానులే, బంధువులైనా, మేనమామలైనా వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు.**

# బంధువులైనా.. మేనమామలైనా చట్టం ముందు సమానులే!

**దళితులను దూషించిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయండి**

**ఎస్పీని ఆదేశించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి**



వనపర్తి అక్టోబర్ 15 (మనం ప్రతినిధి) : సుధీర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తులపై ఇప్పటికే కేసు నమోదు అయిందని, దర్యాప్తు చేసి తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీకి స్వయంగా చెప్పానని ఎమ్మెల్యే తెలిపారు. దళితుల ఆలయ ప్రవేశాన్ని అడ్డుకున్న వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి న్యాయం చేయాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు. తన సొంత గ్రామమైన మంగంపల్లిలో తామంతా అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉంటామని, కొందరు కావాలనే ఈ విషయాన్ని రాజకీయం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఇక్కడి నేతలు ఒక్కసారైనా దళితుల ఇళ్లలో భోజనం చేయలేదని, తాను మాత్రం ఎన్నోసార్లు వారి ఇళ్లలో భోజనం చేశానని, ఎప్పటికీ దళితులను కుటుంబ సభ్యులుగా చూసుకుంటానని ఎమ్మెల్యే మేఘారెడ్డి పేర్కొన్నారు. మంగంపల్లికి చెందిన సుధీర్ కుటుంబంతో తమకు ఎలాంటి భేదాలు లేవని, గ్రామంలో సామరస్యాన్ని చెడగొట్టే ప్రయత్నాలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

# తాగునీటి కొరత ఉండొద్దు

మొదటి పేజీ తరువాయి

బొట్టును పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై జిల్లా ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఉప ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరగడం, వర్షాభావ పరిస్థితులు ఏర్పడటం వంటి పరిణామాలను దృష్టిలో ఉంచుకుని తాగునీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు తెలిపారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలను అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవాలన్నారు. నీటి వృథాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. చెరువులు, కుంటల్లో నీటి నిల్వలను పెంచుకునే అవకాశాలను పరిశీలించాలన్నారు. భవిష్యత్తులో తాగునీటి అవసరాలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, నీటిని బాధ్యతాయుతంగా వినియోగించుకునేలా ప్రజా చైతన్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రాబోయే రెండేళ్లకు అవసరమైన ఆహార ధాన్యాలు అందుబాటులో ఉన్నాయని, ఆహార కొరత ఏర్పడుతుందనే ఆందోళన ప్రజలు చెందాల్సిన అవసరం లేదని ఉప ముఖ్యమంత్రి భట్టి తెలిపారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలకు సరైన సమాచారం అందిస్తూ, తాగునీటి సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

**పోడు రైతులకు ఇబ్బందులు**



**కలిగించొద్దు**

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ హయాంలో అటవీ హక్కుల గుర్తింపు చట్టం (ఆర్ఓఎఫ్ఆర్) కింద పట్టాలు పొందిన గిరిజన రైతులు తమ భూముల్లో సాగు చేసుకునేందుకు ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గిరిజన రైతుల హక్కులను పరిరక్షిస్తూ, వారికి వ్యవసాయంలో మరింత ప్రోత్సాహం అందించాలని అధికారులను ఆదేశించారు. ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు పొందిన గిరిజన రైతుల భూముల్లో సౌర విద్యుత్ ఆధారిత సాగు సదు-పాయాలను కల్పించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ఇందిరా సౌర జల వికాసం పథకం ద్వారా రైతులు ఉద్యాన పంటలు సాగు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. అవకాడో, ఆయిల్‌పామ్, వెదురు వంటి లాభదాయకమైన పంటల సాగుపై ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు.

జిల్లాలోని భూములు దానిమ్మ, ద్రాక్ష వంటి పండ్ల తోటల సాగుకు అనుకూలంగా ఉన్నాయా లేదా అనే అంశంపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. నేల స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులు, మార్కెట్ అవకాశాలను పరిగణనలోకి తీసుకుని రైతులకు ప్రయోజనం చేకూర్చే పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, భూసేకరణకు సంబంధించిన పరిహారం చెల్లింపుల్లో జాప్యం జరగకుండా చూడాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన తర్వాత వాటిని లబ్ధిదారులకు సకాలంలో అందించాలన్నారు. కలెక్టర్ ఖాతాల్లో నిధులను నిల్వ ఉంచడం తగదని స్పష్టం చేశారు. పరిహారం కోసం ఎదురుచూస్తున్న బాధితులకు నిబంధనల ప్రకారం త్వరితగతిన చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**పాఠశాలల నిర్మాణాలు**

**గడువులోగా పూర్తి చేయాలి**

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనుల పురోగతిని భట్టి విక్రమార్క పూర్తి స్థాయిలో సమీక్షించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు కల్పించేందుకు చేపడుతున్న నిర్మాణాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల నాణ్యతలో రాజీ పడకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిర్మాణాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడటంతోపాటు అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. ప్రజల అవసరాలకు ప్రాధాన్యమిస్తూ, తాగునీటి సంరక్షణతో పాటు అన్ని రంగాల్లో సమర్థవంతమైన సేవలు అందించేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, ఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ వి పాటిల్, నాగర్‌కర్నూల్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, అదనపు కలెక్టర్లు బి చెన్నయ్య, దేవ సహాయం, జిల్లా ఫారెస్ట్ అధికారి రేవంత్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# మర్రి జర నోరు ముయ్యి

## అచ్చంపేట ప్రాంత అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత కోల్పోయావు

### యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కుంద మల్లికార్జున్



ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 14 (మనం బ్యూరో) : అయ్యా నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి మీరు అచ్చంపేట ప్రాంత అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత పూర్తిగా కులిపోయారని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కుంద మల్లికార్జున్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన ఒక ప్రకటనలో తెలుపుతూ... అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అభివృద్ధి విషయంలో అనేక పనులు చేస్తుంటే నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డికి కనిపిస్త లేదా అని వ్యంగంగా మాట్లాడారు. మర్రి అనేవారు అచ్చంపేట ప్రాంతానికి ఒక చుట్టపు చూపుగా...? టూరిస్ట్ లీడర్గా అచ్చంపేటకు అమావాస్య పున్నానికి వచ్చే వారికి అభివృద్ధి అంటే ఏం కనబడుతుందన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి తాడు బొంగరం లేదని విమర్శించారు. గడిచిన వెయ్యి రోజులలో కాంగ్రెస్ పార్టీ పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజల ముందుకు తీసుకువచ్చిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికి దక్కిందన్నారు. అదేవిధంగా అచ్చంపేట ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ను విమర్శించే అర్హత మర్రి పూర్తిగా కోల్పోయారని దుయ్యబట్టారు. ఎమ్మెల్యే గురించి మాట్లాడే ముందు అభివృద్ధి అంటే ఎంటో తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందని చిరుకలు అంటించారు. స్థానికంగా ఉండే అచ్చంపేట అభివృద్ధి ఎలా ఉంటుందో ఈ ప్రాంత వాసులకే తెలుస్తుంది కానీ, చుట్టపు చూపుగా వచ్చే నీకు అచ్చంపేట అభివృద్ధి ఎలా ఉందో మీకు ఏం తెలుస్తుందన్నారు.

# ఖతార్‌లో నర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

### జోగులాంబ గద్వాల జిల్లా ఉపాధి కల్పనాధికారి ప్రశాంతి

ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 14 (మనం బ్యూరో) : తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (TOMCOM) ద్వారా ఖతార్‌లో హోమ్‌కేర్ సేవల్లో పనిచేసేందుకు లైసెన్స్‌డ్ ప్రాక్టీషనర్ నర్సులు, నర్స్ టెక్నీషియన్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ప్రశాంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హతలు, సంబంధిత పని అనుభవం, క్లినికల్ నైపుణ్యాలు, ఆంగ్ల భాషలో సంభాషణ సామర్థ్యం ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఈ ఉద్యోగాలకు 20 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల మహిళలు, పురుషులు దరఖాస్తు చేసుకోవచ్చు. నర్స్ టెక్నీషియన్లకు కనీసం ఒక సంవత్సరం, లైసెన్స్‌డ్ ప్రాక్టీషనర్ నర్సులకు కనీసం రెండేళ్ల పని అనుభవం ఉండాలన్నారు. నర్స్ టెక్నీషియన్లకు నెలకు రూ.73,000, లైసెన్స్‌డ్ ప్రాక్టీషనర్ నర్సులకు నెలకు రూ.95,000 జీతం అందిస్తారు. ఈ ఉద్యోగాలకు ప్రోమెట్రిక్ పరీక్ష అవసరం లేదన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఉద్యోగ వీసా, విమాన ప్రయాణ టికెట్, నిర్దేశిత పికప్/డ్రాప్ పాయింట్లకు రవాణా సౌకర్యం, వసతి, ప్రాథమిక వైద్య బీమా కల్పిస్తారని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు మరిన్ని వివరాలకు తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (TOMCOM)ను 08035524946 ఫోన్ నంబర్ లేదా tomcomglobal@gmail.com ఈ-మెయిల్ ద్వారా సంప్రదించవచ్చన్నారు.

# నూతన గృహప్రవేశానికి హాజరైన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

వనపర్తి అక్టోబర్ 15 (మనం ప్రతినిధి) పానగల్ మండలం బండపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ కోమారి ఆంజనేయులు నూతనంగా నిర్మించుకున్న గృహ ప్రవేశ వేడుక బుధవారం ఘనంగా జరిగింది. ఆయన భార్య భాగ్యమ్మ, కుమారులు రాకేష్, రాఘవేందర్ ఆహ్వానం మేరకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన గృహంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెబ్బేటి వీరసాగర్, సీనియర్ నాయకులు చంద్రశేఖర్ నాయక్, వెంకటయ్య నాయుడు, రాంచందర్, గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు అశోక్ నాయుడు, ఉపాధ్యక్షుడు నాగరాజు నాయుడు, సుదర్శన్ నాయుడు, యుగంధర్ నాయుడు, బోరెల్లి రాజబాబు, రామకృష్ణ, కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.





మనం పత్రిక తెలంగాణ నెట్ వర్క్ ఇంచార్జ్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం కల్వకుర్తిలో జిల్లా పరిధి విలేకరులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పత్రిక అభివృద్ధికి సంబంధించి పలు చర్చలు జరిపారు. అనంతరం విజయ్‌కుమార్‌ను శాలువాతో సత్కరించారు.

# రైతు సంక్షేమమే లక్ష్యం... వ్యవసాయాభివృద్ధే ధ్యేయం!

**ఎన్మనబెట్ల గ్రామ రైతులకు 27 యూనిట్ల సబ్సిడీ స్ప్రింక్లర్ పైపుల పంపిణీ**

కొల్లాపూర్, అక్టోబర్ 15 (మనం న్యూస్) : రైతు సంక్షేమమే లక్ష్యంగా, వ్యవసాయ అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని నాయకులు పేర్కొన్నారు. మంత్రి వర్యులు శ్రీ జూపల్లి కృష్ణారావు గారి సహకారంతో, నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం ఎన్మనబెట్ల గ్రామ రైతులకు ఉద్యానవన శాఖ (హార్టికల్చర్) ద్వారా మంజూరైన 27 యూనిట్ల సబ్సిడీ స్ప్రింక్లర్ పైపులను కొల్లాపూర్ మార్కెట్ యార్డులో పంపిణీ చేశారు. ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారుల సమక్షంలో రైతులకు స్ప్రింక్లర్ పైపులను అందజేశారు. ఈ పరికరాలు రైతులకు సాగునీటి వినియోగంలో తోడ్పడటంతో పాటు, వ్యవసాయ ఖర్చులను తగ్గించేందుకు ఉపయోగపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్మనబెట్ల గ్రామ రైతులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ మాజీ సర్పంచ్ శ్రీ మేకల నాగరాజు, మాజీ ఎంపీపీ నిరంజన్ రావు, మాజీ జెడ్పీటీసీ హనుమంతు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బచ్చలకూర బాలరాజు, మాజీ సర్పంచ్ పాశం నాగరాజు, ఎల్లేని సురేష్ రావు, గుంద్రాతి శేఖర్ గౌడ్, చటమోని సత్యనారాయణ, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వ పథకాలు దోహదపడుతున్నాయని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.





## అంబా భవాని ఆలయంలో అడిషనల్ కలెక్టర్ వినోద్ ప్రత్యేక పూజలు

కొత్తకోట, అక్టోబర్ 14 (మనం న్యూస్) :వనపర్తి జిల్లా అడిషనల్ కలెక్టర్ వినోద్ తన కుటుంబ సభ్యులతో కలిసి కొత్తకోట పట్టణంలోని శ్రీ అంబా భవాని ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్‌తో పాటు ఆర్ఐ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు అడిషనల్ కలెక్టర్ వినోద్ ఆయన కుటుంబ సభ్యులను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేసి, ఆలయ విశిష్టతను వివరించారు.

# ఆలయంలో కుల వివక్షకు నిరసనగా బీజేపీ ఎస్సీ మోర్చా ధర్నా

**24 గంటల్లో నిందితులపై కేసు నమోదు చేయాలి**

**బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు గంధం ప్రవీణ్ కుమార్**

వనపర్తి అక్టోబర్ 15 (మనం ప్రతినిధి) : పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామంలో ఆలయంలోకి దళితుడిని అడ్డుకున్న ఘటనను నిరసిస్తూ వనపర్తి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం భారీ ధర్నా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్, డీఎస్పీ, పలు ఎస్సీ కుల సంఘాలు మద్దతు తెలిపాయి. మంగంపల్లి గ్రామంలో కుటుంబంతో కలిసి ఆలయానికి వెళ్లిన సుధీర్ అనే వ్యక్తిని కుల



వివక్షతో అడ్డుకున్నారని, ఇందులో వనపర్తి ఎమ్మెల్యే మేనమామ వెంకట్రామిరెడ్డి పాత్ర ఉందని బీజేపీ నేతలు ఆరోపించారు. ఈ సందర్భంగా ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గంధం ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ "స్వతంత్ర భారతంలో రాజ్యాంగం సమాన హక్కులు కల్పించినా దళితులపై వివక్ష కొనసాగడం హేయం. అధికార పార్టీ అండతో దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే ఊరుకోం" అని మండిపడ్డారు. వెంకట్రామి రెడ్డిపై తక్షణమే ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని, 24 గంటల్లో చర్యలు తీసుకోకపోతే అన్ని మండల కేంద్రాల్లో ఆందోళనలు చేపడతామని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామన్నగారి వెంకట్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్ గౌడ్, పెద్ది రాజు, మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్, పట్టణ అధ్యక్షుడు బత్తిని మధుసూదన్, వారణాసి కల్పన, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము చిన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్ని చేనేతకు మహర్దశ

**వెల్టూర్ ఉన్ని చేనేత సహకార సంఘం అధ్యక్షులు చింతల వెంకటేశ్వర్లు**

పెద్దమందడి, అక్టోబర్ 15 (మనం ప్రతినిధి) : వ్యవసాయ రంగం తర్వాత అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న చేనేత రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని వెల్టూర్ ఉన్ని చేనేత సహకార సంఘం అధ్యక్షుడు చింతల వెంకటేశ్వర్లు అన్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో అధిక సంఖ్యలో ఉన్న చేనేత సహకార సంఘాలపై అనేక కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని, టెస్కో ద్వారా మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తూ ఉత్పత్తి ఆర్డర్లు ఇవ్వడం వల్ల కార్మికులకు ఉపాధి లభిస్తోందని తెలిపారు. చాలా కాలంగా నిర్లక్ష్యానికి గురైన ఉన్ని చేనేత సంఘాలకు ప్రస్తుత ప్రభుత్వం చేయూతనిస్తోందని, ఉన్ని దుప్పట్ల ఉత్పత్తికి ఆర్డర్లు కేటాయించడంతో కార్మికులకు తిరిగి పని దొరుకుతోందని చెప్పారు. తమ సంఘానికి ఇటీవల 2,500 దారం కిట్లు సరఫరా కావడంతో సుమారు 20 నెలల పాటు ఉపాధి లభించే అవకాశం ఏర్పడిందని వెల్లడించారు. ఈ సహకారం అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, చేనేత శాఖ కమిషనర్ కు కృతజ్ఞతలు తెలిపారు. దారం నిల్వకు ప్రత్యేక భవనం మంజూరు చేయాలని, మరిన్ని ఉత్పత్తి ఆర్డర్లు కేటాయించి ఉన్ని చేనేత రంగాన్ని బలోపేతం చేయాలని కోరారు.



# సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి తీరుతాం

**ఉమ్మడి పాలమూరు జిల్లాలోని చివరి ఆయకట్టుకు సాగునీరందిస్తాం**

**గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలమూరు ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసింది**

**పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల బాహుబలి మోటర్లు ప్రారంభించిన మంత్రి జూపల్లి**



కొల్లాపూర్ 15 అక్టోబర్ (మనం న్యూస్) : రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసి ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదు? ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్ట్ లను పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గారు స్పష్టం చేశారు. రాజకీయ లబ్ది కోసం బీఆర్ఎస్ నేతలు అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నార్లాపూర్ రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన రెండు భారీ బాహుబలి మోటార్లను మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. ఈ మోటార్ల ద్వారా నార్లాపూర్ రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోయనున్నారు. ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను పూర్తి చేయకుండానే.. దీన్ని జాతికి అంకితం చేశారని, కానీ కాలువలు, డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్, ఇతర పనులను గత ప్రభుత్వం చేపట్టలేదని విమర్శించారు. ప్రాజెక్టును గత పాలకులు పూర్తిచేసి ఉంటే ప్రస్తుతం ఈ పరిస్థితి తలెత్తేది కాదన్నారు. వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల ద్వారా లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉన్నా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం చేసిందని ధ్వజమెత్తారు. మహాత్మాగాంధీ--కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద 4.60 లక్షల ఎకరాలు, నెట్టెంపాడు ప్రాజెక్టు ద్వారా 2 లక్షల ఎకరాలు, భీమా ప్రాజెక్టు ద్వారా 2 లక్షల ఎకరాలు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కింద 50 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉందని తెలిపారు. ఇన్ని లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టులను గత ప్రభుత్వం ఎందుకు పూర్తి చేయలేకపోయిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పాలమూరు రైతాంగం ప్రయోజనాల కంటే రాజకీయ ప్రచారానికే బీఆర్ఎస్ నేతలు ప్రాధాన్యమిస్తున్నారని అన్నారు. రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చిన గత పాలకులు, ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను ఎందుకు పూర్తిచేయలేదో ప్రజలకు వివరించాలని నిలదీశారు. రైతాంగానికి సాగునీరు అందించడంలో గత ప్రభుత్వం విఫలమైందని, ప్రస్తుతం ప్రాజెక్టుల పురోగతిపై అవగాహన లేకుండా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశానిర్దేశం మేరకు సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ప్రాజెక్టుల వారీగా సమస్యలను గుర్తించి, పనుల పురోగతిని సమీక్షిస్తూ ముందుకు సాగుతున్నామని చెప్పారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు ప్రయోజనం చేకూర్చడం, వ్యవసాయానికి అవసరమైన నీటిని అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ ప్రాధాన్యమని జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.





## రామ్‌రెడ్డిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలని కేవీపీఎస్ ధర్నా

మహబూబ్ నగర్ 14అక్టోబర్, (మనం న్యూస్) : పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామంలో దళితులను గుడిలోకి రాకుండా అడ్డుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ విగ్రహం దగ్గర ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నా టౌన్ కార్యదర్శి ఆదివిష్ణు అధ్యక్షతన జరిగింది.ఈ ధర్నా నిర్దేశించి కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం కుర్మయ్య, జిల్లా అధ్యక్షులు మాణిక్యం రాజు మాట్లాడుతూ పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామంలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దళిత యువకుడు సుధీర్ అతని కుటుంబం గుడిలోకి వెళ్లి మొక్కడానికి పోతే, వనపర్తి ఎమ్మెల్యే మెగా రెడ్డి మామ రామ్ రెడ్డి ఈ గుడిని మేము కట్టించాము దళితులు ఈ గుడిలోకి రాకూడదు వెళ్లిపోండి అని అవమానకరంగా మాట్లాడినాడు రామ్ రెడ్డి తన అనుచరులపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే సొంత గ్రామంలో కుల వివక్షత,అంటరానితనం కొనసాగుతుంటే ఏం చేస్తున్నారని అని ప్రశ్నించారు. ప్రతినెల జరిగే సివిల్ రైట్స్ డే లో మంగంపల్లి గ్రామం అధికారులకు కనిపించలేదా అని ప్రశ్నించారు. వనపర్తి ఎమ్మెల్యే దళితులపై ప్ దళితులను మనుషులుగా గుర్తిస్తే, కుల వివక్షత అంటరానితనం, పోవాలనుకుంటే దళితులందరినీ గుళ్లోకి తీసుకొని పోవాలని వారు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ ఎస్పీ ఆ గ్రామాన్ని సందర్శించి దళితులకు ఆలయ ప్రవేశం కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ టౌన్ కార్యదర్శి ఆదివిష్ణు, బుద్ధిష్టి సొసైటీ సంఘం జిల్లా అధ్యక్షులు బాలకృష్ణయ్య, సిఐటియు టౌన్ కన్వీనర్ రాజ్ కుమార్ లు తదితరులు పాల్గొన్నారు

# భూ రీసర్వే పకడ్బందీగా జరపాలి

**క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీ చేసిన అదనపు కలెక్టర్**



గోపాలపేట అక్టోబర్ 14 :(మనంన్యూస్) : భూ రీ సర్వే పనులను పగడ్బందీగా పారదర్శకంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ అన్నారు. బుధవారం రిజర్వాయర్ ముంపునకు గురవుతున్న భూములను పలు గ్రామాల్లో క్షేత్రస్థాయి-ంలో అదనపు కలెక్టర్ వినోద్ కుమార్ ఆకస్మికతనికి చేపట్టారు. ఈ సందర్భంగా పదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూ రీ-సర్వే ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, వారి సమక్షంలోనే భూముల హద్దులను ఖచ్చితంగా నిర్ధారించాలని సూచించారు. గోపాల్‌పేట మండలం చెన్నూరు, ఏదుల మండలం రేకులపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్వే రికార్డులను పరిశీలించడంతో పాటు, సర్వే బృందాలు వినియోగిస్తున్న ఆధునిక రోవర్ యంత్రాల పనితీరును, భూముల హద్దుల గుర్తింపు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపడుతున్న భూ రీ-సర్వే ద్వారా భూముల హద్దులపై స్పష్టత ఏర్పడటంతో పాటు, భవిష్యత్తులో భూ వివాదాలను నివారించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. సర్వే నిర్వహించే ముందు సంబంధిత భూయజమా నులకు, సరిహద్దుల్లో ఉన్న రైతులకు ముందస్తు సమాచారం అందించాలని సూచించారు. భూముల హద్దులను నిర్ణయించే సమయంలో సంబంధిత రైతుల సమక్షంలోనే సర్వే చేపట్టాలని స్పష్టం చేశారు.సర్వే వివరాలను రికార్డుల్లో నమోదు చేసే సమయంలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని, క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించిన తర్వాతే భూముల హద్దులను ఖరారు చేసి సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రీ-సర్వేకు సంబంధించి రైతులకు ఏవైనా సందేహాలు లేదా అభ్యంతరాలు ఉంటే క్షేత్రస్థాయిలోనే వాటిని పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. భూ రీ-సర్వే ద్వారా రైతులకు ప్రయోజనం చేకూరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. రైతులు కూడా సర్వే బృందాలకు పూర్తి సహకారం అందించి, తమ భూముల హద్దుల నిర్ధారణ ప్రక్రియలో భాగస్వాములు కావాలనికోరారు.ఈ తనిఖీల్లో సంబంధిత తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, గ్రామ పాలన అధికారులు, సర్వే సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

నారాయణపేట అక్టోబర్ 14 (మనం న్యూస్) : దేశంలోనే తెలంగాణ ప్రజల సంస్కృతి ప్రత్యేకతను కలిగినది. ప్రజల భాష, ఆచారాలు, పండుగలు సహజ సిద్ధమైన ప్రకృతికి ఆనవాలుగా నిలుస్తాయి. మానవ సంబంధాల చిరునామా బతుకమ్మ పండుగ. పూలనే దేవతగా కొలిచే ప్రత్యేక సంస్కృతి తెలంగాణకే సొంతం. అదే మన పూల జాతర బతుకమ్మ పండుగ ప్రత్యేకత. పూలనే దేవతగా కొలిచే అపురూపమైన పండుగ బతుకమ్మ. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి.. ఆడపడుచులంతా ఒక్కచోట చేరి తమ అనుభవాలనే పాటలుగా మలిచి.. చప్పట్లతో గౌరమ్మను కొలిచే వేడుక.

ప్రకృతిని ఆరాధిస్తూ పుడమి తల్లి గొప్పదనాన్ని కీర్తిస్తూ మురిసిపోయే క్షణాలకు వేదిక. తెలంగాణ అస్తిత్వానికి సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా భావించే బతుకమ్మ పండుగ తొమ్మిది రోజుల పాటు జరుగుతుంది. బతుకమ్మ సంబరాలు ఏటా పెతర అమావాస్య రోజున ఎంగిపూల బతుకమ్మతో మొదలై.. సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి.

ఈసారి సెప్టెంబర్ 10వ తేదీ నుంచి(ఎంగిలిపూల బతుకమ్మ) ఈ సంబరాలు మొదలు అయ్యాయి. ఈ సందర్భంగా బతుకమ్మ పండుగ నేపథ్యం గురించి ఆసక్తికర విషయాలు మీకోసం. ప్రకృతిలో సహజసిద్ధంగా లభించే పూలతో కూడిన అమరిక బతుకమ్మ. సాధారణంగా గునుగు, గుమ్మడి, తంగేడు, కట్ల పూలు, గోరంట్ల పూలు పట్టుకుచ్చులు (సీతజడ పూలు) స్థూపాకారంలో వరుసలుగా పేర్చి.. పైభాగంలో మధ్యలో 'గౌరమ్మ' ను పెడతారు.బతుకమ్మ పండుగ జానపదుల జీవన శైలిని ప్రతిబింబిస్తుంది. తెలంగాణీయులు పుట్టమన్నుతో చిన్న పీటమీద చతురస్రాకారంలో గుడిగోపురం ఆకారాన్ని చేస్తారు. దాన్ని పూలతో అలంకరిస్తారు. దీన్నే బొడ్డెమ్మ గా కొన్ని ప్రాంతాల్లో గౌరమ్మగా పిలుస్తారు. సాయంత్రం వేళలో బొడ్డెమ్మను రుద్రాక్ష, గోరింట పూలతో అలంకరిస్తారు. సందెవేళ కూడలిలోనో, వాకిట్లోనో అలికి ముగ్గుపెట్టి దానిలో బొడ్డెమ్మ ఉంచి పెండ్లికాని ఆడపిల్లలు పాటలు పాడుతూ ఆడుతారు. బతుకమ్మా(జీవించు అని అర్థం) మాకు బతుకునీయవమ్మా (మమ్మల్ని చల్లగా చూడు తల్లీ) అని పాటలతో అమ్మను వేడుకుంటారు. తెలంగాణలో 'చుట్టుగాముడు' అనేది మౌలికమైనది. ప్రాచీనమైనది. దీన్ని ప్రాచీనమైన జానపద నృత్యం గా భావించవచ్చు. ఒక్కొక్క ప్రాంతంలో వారి అభిరుచులకు అనుగుణమైన మార్పులతో నృత్య వైవిధ్యాన్ని కనబరుస్తారు.

బతుకమ్మ పండుగ నేపథ్యం ఇలా..

బతుకమ్మ నేపథ్యానికి సంబంధించి అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. బతుకమ్మ సంబరాల్లో భాగంగా పాడుకునే పాట ప్రకారం.. ధర్మాంగధుడు అనే రాజుకు వంద మంది కుమారులు పుట్టి చనిపోయారు.దుఃఖంలో మునిగిపోయిన దంపతులు తమ కడుపున ఆ లక్ష్మీదేవి పుట్టాలని ప్రార్థిస్తారు. వారి మొరను ఆలకించిన ఆ తల్లి ఆ దంపతులకు జన్మిస్తుంది. ఆమెను దీవించేందుకు రాజు నివాసానికి వచ్చిన మునులు 'నువ్వు ఎల్లకాలం బతుకమ్మ' అని ఆమెను దీవించినట్టు కథ ప్రచారంలో ఉంది.



మరో కథ ఇలా...

ఇక బతుకమ్మ చుట్టూ చేరి.. పండుగకు కారణమైన కథను గానం చేసే పల్లె ప్రజల పదాల ఆధారంగా.. బతుకమ్మ నేపథ్యానికి సంబంధించి మరో కథ కూడా ప్రాచుర్యం పొందింది. అనగనగా ఓ రాజు. ఆ రాజుకు ఓ చిన్న కోడలు. వారి ఊరికి జీవనాధారం చెరువు. ఎంతో విశాలమైన ఆ చెరువు వానలు బాగా పడటంతో మత్తడిదుంకుతుంది. ఎడతెరిపి లేని వానల వల్ల చెరువు నిండి కట్టకు గండిపడుతుంది. గండిని పూడ్చేందుకు ఊరంతా ప్రయత్నించినా ఫలితం ఉండదు. అయితే, చెరువు కట్ట అంటే అక్కడ మైసమ్మ (గ్రామ దేవత) కొలువు ఉంటుందని చాలా మంది నమ్మకం. ఆమే చెరువుకు రక్షణగా ఉంటుందని భావిస్తారు.అందుకే కట్ట నిలవాలంటే మైసమ్మను శాంతింపచేయాలని రాజు,ప్రజలు భావిస్తారు. కట్టను నిలిపేందుకు తన



బర్రెల మందను ఇస్తానని రాజు మైసమ్మను వేడుకుంటాడు. ఇందుకు బదులుగా మైసమ్మ తల్లి తనకు కూడా బర్రెల మంద ఉందని సమాధానమిస్తుంది. ఆవుల మంద, గొర్రెల మంద, మేకలమంద ఇలా ఏది ఇస్తానన్నా అవన్నీ తన దగ్గర కూడా ఉన్నాయని చెబుతుంది. దీంతో ఆ రాజు తమ ఊరి బాగు కోసం తన కుటుంబ సభ్యులను అర్పిస్తానని ఆమెకు చెబుతాడు. కానీ ఆ గ్రామ దేవత శాంతించదు ఏటు దోచని స్థితిలో ఆ రాజు.

**చిన్న కోడల్నిస్త ఉయ్యాలో..**
**కట్ట నిలుపే మైసు ఉయ్యాలో ..**

అని రాగం అందుకోగానే మైసమ్మ సంతృప్తి పడుతుంది. కట్ట తెగకుండా ఆపుతుంది. ఇక అన్న మాట ప్రకారం రాజు ఇంటికెళ్లి తన చిన్న కోడలిని చెరువు దగ్గరకు తీసుకువచ్చేందుకు పూనుకుంటాడు. కానీ ఆమెకు తను చేయాల్సిన త్యాగం గురించి చెప్పడు. అయితే, చిన్న కోడలి పసిపాపాయి గురించి వివరాలు అడుగుతూ అన్ని పనులు పూర్తయ్యాయని ఆమె చెప్పగానే చెరువుకు పోయి నీళ్లు తెమ్మనిచెబుతాడు. మామ మాటను గౌరవించి ఆ చిన్న కోడలు బిందె పట్టుకుని చెరువు దగ్గరకు వెళ్తుంది. అయితే, ఎంత ముంచినా బిందె మునగదు. నడుము లోతు వరకు వెళ్లినా అదే పరిస్థితి. అంతలో ఆ రాజు కల్పించుకుని ఇంకొంచెం లోపలికి పొయ్యి నీళ్లు తే అని చెబుతాడు. అలా మరింత లోతుకు వెళ్లిన ఆమె బిందెతో పాటు చెరువులో మునిగిపోతుంది. తన పరిస్థితి ఏమిటో తెలుసుకున్న ఆ తల్లి తన తల్లిదండ్రులకు బిడ్డ లేదని, తన బిడ్డకు తల్లి లేదని చెప్పమంటూ పాటు పాడుతూ పూర్తిగా మునిగిపోతుంది. బొడ్డెమ్మనై.. మళ్లీ వస్తానంటూ శాశ్వతంగా సెలవు తీసుకుంటుంది. అయితే, ఎక్కడైతే ఆ రాజు చిన్న కోడలు మునిగిందో అక్కడ పూలన్నీ నీళ్లలో తేలతాయి. ఊరి కోసం ప్రాణాలు అర్పించిన ఆ ఆడబిడ్డ త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ.. బతుకమ్మ రూపంలో ఆమె కలకాలం తమతోనే ఉంటుందని.. పూలతో ఆమెను పూజించుకుంటామని ఊరి వాళ్లంతా చెప్పినట్టు కథ సాగుతుంది ఇవే కాక మరెన్నో కథలు ప్రచారంలో ఉన్నాయి..

**పౌరాణిక కథ**

శ్రీగౌరి మహిషాసురుని చంపిన తర్వాత (ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు) అలసటతోమూర్ఛిల్లగా, ఆమెను మూర్ఛ నుంచి తేర్చడానికి స్త్రీలం తా గుమిగూడి పాటలు పాడగా పదవ రోజున స్పృహలోకి వచ్చిం ది. మూర్ఛలోని ఆమెను తిరిగి 'బతుకమ్మ' అని పాడితే బతికింది. గనక ఆ పదిరోజులు పండుగ జరుపుకుంటారు అనేది ఒక కథనం.

**చారిత్రక గాథ**

చోళ దేశాన్ని ధర్మాంగదుడు అనే రాజు పాలించేవాడు. అతని భార్య సత్యవతి. వారికి నూరుగురు పుత్రులు పుట్టినప్పటికీ వారంతా యుద్ధాలలో చనితారు. ఆ రాజ దంపతులు తీరని దుఃఖంతో లక్ష్మీ దేవిని గురించి తపస్సు చేయగా ఆమె ప్రత్యక్షమై వారి కోరిక ప్రకారం వారికి



కుమార్తెగా జన్మిస్తుంది. ఆమెను మునులంతా 'నిండు నూరేళ్లు బతుకమ్మ'అని దీవిస్తారు. మరో చోట చక్రాంకుడనే రాజుగా వెలసిన మహా విష్ణువు లక్ష్మీ స్వరూపులైన బతుకమ్మను పెండ్లి చేసుకుంటాడు. నాటి నుంచి ప్రజలు లక్ష్మీదేవి అవతారంగా బతుకమ్మను పూలతో అలంకరించి పూజిస్తారనేది మరో కథనం.

**సామాజికం**

శతాబ్దాల క్రితం తెలంగాణలో కరువు కాటకాలు, భయంకర వ్యాధులు సోకి చాలామంది చనిపోతారు. దాంతో ప్రజలంతా తమ ప్రాణాలు కాపాడమని బతుకమ్మను వేడుకుంటారు. బతుకు నిలిపిన దేవతగా నాటి నుంచి బతుకమ్మను పూజిస్తూ పండుగ జరుపుకుంటారనేది మరో కథనం. ఒక గ్రామంలో చాలా ఏండ్ల తర్వాత వానలు కురిసి చెరువు కట్ట తెగిపోయింది. గండి పూడ్చటానికి గ్రామ ప్రజలు ఎంత ప్రయత్నించినా వీలు కాలేదు. దాంతో కన్యగా ఉన్న బతుకమ్మ గండి పడిన చోట బలికి సిద్ధపడి ప్రజల్ని బతికిస్తుంది. అప్పటినుంచి ఆటపాటలతో ఆమెను ఆరాధించడమే బతుకమ్మ పండగ అనేది మరో వ్యవహారిక కథనం.

తొమ్మిది రోజుల బతుకమ్మ...

మొదటి రోజు- ఎంగిలిపూల బతుకమ్మ, రెండో రోజు- అటుకుల బతుకమ్మ, మూడో రోజు- ముద్దపప్పు బతుకమ్మ, నాలుగో రోజు- నానే బియ్యం బతుకమ్మ, ఐదో రోజు- అట్ల బతుకమ్మ, ఆరవ రోజు - అలిగిన బతుకమ్మ, ఏడో రోజు- వేపకాయల బతుకమ్మ, ఎనిమిదవ రోజు- వెన్నముద్దల బతుకమ్మ, తొమ్మిదో రోజు- సద్దుల బతుకమ్మ

ముఖ్యంగా పల్లెల్లో అయితే పోటా పోటీగా భిన్న రుచులను తయారు చేసి మరీ వడ్డిస్తారు. ఇంట్లో చేసుకున్న ఏ వంటకమయినా.. మరో నలుగురికి పంచి వారితో తినిపించడం బతుకమ్మ పండుగలో కనిపించే సంతోషకరమైన సన్నివేశం. తొమ్మిది రోజుల బతుకమ్మ సంబరంలో కనిపించే ముఖ్యమైన ప్రసాదాలు ఇవి.

**మొదటి రోజు : ఎంగిలిపూల బతుకమ్మ**

బతుకమ్మ మొదటి రోజు పెతర అమావాస్య నాడు జరుపుకొంటారు. ఆరోజు

- మిగతా 6వ పేజీలో..

## వెంకట్రాంరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

**బిజెపి ఏదుల మండల ప్రధాన కార్యదర్శి, దొడ్ల నాగరాజు**



ఉమ్మడి గోపాల్ పేట్, అక్టోబర్ 14 (మనం న్యూస్) : వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామంలో కొత్త ఆలయ ప్రవేశానికి వచ్చిన ఒక దళిత కుటుంబాన్ని కులం పేరుతో దూషించి బయటకి గెంటేసిన వనపర్తి జిల్లా ఎమ్మెల్యే మెగా రెడ్డి మేనమామ వెంకటరాము రెడ్డి పై వెంటనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బిజెపి ఏదుల మండల ప్రధాన కార్యదర్శి దొడ్ల నాగరాజు బుధవారం ఏర్పాటు చేసిన ఒక సమావేశం లో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ దళిత కుటుంబం పై జరిగిన దానికి బాధ్యత వహిస్తు ఎమ్మెల్యే మెగా రెడ్డి రాజీనామా చేయాలని, హెచ్చరిస్తున్నామన్నారు.దళితుల ఓట్లతో గెలిచి దళితులు గుడిలోకి వస్తే కులం పేరుతో అవమాన పరుస్తారా మీరు ఇంకా ఏ సమాజంలో ఉన్నారు. ఇంకా ఎన్ని రోజులు రా ఈ అరాచక పాలన దౌర్జన్యకరమైన పాలన , భారత రాజ్యాంగం అనే వ్యవస్థలో నడు-స్తున్నాం మనం, స్వేచ్ఛ సమానత్వం సోదర భావం అని విలువలతో బ్రతకమని, మన భారత రాజ్యాంగం చెప్తున్నా దీని, మరిచి మరి మృగాల లాగా, రాక్షసుల లాగా ప్రవర్తిస్తున్న వారిని ఊర్లు నుండీ తరిమికొట్టే రోజులు తెచ్చుకోవద్దని హెచ్చరిస్తున్నాం. గ్రామపంచాయతీ సంబంధించి గవర్నమెంట్ స్థలం లో ఉన్న దేవాలయం మీ జాగిరి కాదు,గ్రామంలో నివసించే ముసలి ముతక,పుట్టే పిల్లగాడి నుంచి చనిపోయే ముసలవ్వకు కూడా దానిపై అధికారం ఉంది, కనుక బాధ్యులపై అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీయసుకోవాలని డిమాండ్ చేస్తున్నట్టు చెప్పారు.

## బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

5వ పేజీ తరువాయి..

నువ్వులు, బియ్యం పిండి, నూకలు కలిపి నైవేద్యం తయారు చేస్తారు. పండుగకు ముందు ఆయా పుష్పాలన్నీ వివిధ కీటకాల పరాగ సంపర్కం కారణంగా ఎంగిలి పడ్డాయని తలచి మొదటి రోజు బతుకమ్మను ఎంగిలిపూల బతుకమ్మగా వ్యవహరిస్తారు. ఆరోజు నువ్వుల సద్దిని అందరితో పంచుకుంటారు.

**రెండో రోజు :** అటుకుల బతుకమ్మ : రెండో రోజు అటుకుల ప్రసాదం చేస్తారు. సప్పిడి పప్పు, బెల్లం, అటుకులు కలిపి అమ్మవారికి ఇష్టంగా వడ్డించే నైవేద్యం ఇది.

**మూడో రోజు :** ముద్దపప్పు బతుకమ్మ : మూడో రోజు ముద్దపప్పు బతుకమ్మ. ముద్ద పప్పు, పాలు, బెల్లంతో వేడివేడిగా నైవేద్యం తయారు చేసి అమ్మవారికి సమర్పిస్తారు.

**నాలుగో రోజు :** నానబియ్యం బతుకమ్మ : నాలుగో రోజు నాన బియ్యం



బతుకమ్మ. నాన బెట్టిన బియ్యంను పాలు, బెల్లంతో కలిపి ఉడికింది ప్రసాదంగా తయారు చేస్తారు.

**ఐదో రోజు :** అట్ల బతుకమ్మ : ఐదోరోజు అట్ల బతుకమ్మ. అట్లు లేదా దోశలను అమ్మవారికి నైవేద్యంగా వడ్డిస్తారు.

**ఆరవ రోజు :** అలిగిన బతుకమ్మ : ఆరో రోజు అలిగిన బతుకమ్మగా జరుపుకొంటారు. ఆరోజు అమ్మవారికి అలకగా చెప్పుకుంటారు. ఉపవాసం పాటిస్తారు.

**ఏడో రోజు :** వేపకాయల బతుకమ్మ : ఏడోరోజు వేపకాయల బతుకమ్మ. బియ్యంపిండిని బాగా వేయించి వేపపండ్లుగా తయారుచేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు.

**ఎనిమిదవ రోజు :** వెన్నెముద్దల బతుకమ్మ : ఎనిమిదో రోజు వెన్నెముద్దల బతుకమ్మ. నువ్వులు, వెన్న లేదా నెయ్యి బెల్లం కలిపి వెన్నముద్దల నైవేద్యంగా వడ్డిస్తారు.

**తొమ్మిదో రోజు :** సద్దుల బతుకమ్మ : బతుకమ్మ నవరాత్రి ఉత్సవాల్లో చివరి రోజును సద్దుల బతుకమ్మగా జరుపుకొంటారు. తొమ్మిదోరోజు పెరుగన్నం, చింతపండు పులిహోర, కొబ్బరన్నం, నువ్వులన్నం అనే ఐదురకాల నైవేద్యాలు తయారు చేసి అమ్మవారికి నివేదిస్తారు.

# భూసేకరణలో జాప్యం వద్దు

**మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులు వేగవంతం చేయాలి**

**పెండింగ్ సమస్యలు, పరిహారం చెల్లింపులను త్వరితగతిన పరిష్కరించాలి: కలెక్టర్ ప్రియాంక**



నారాయణపేట, అక్టోబర్ 14( మనం న్యూస్) : మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకానికి సంబంధించి చేపట్టిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయడంతోపాటు, పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రైతులకు సంబంధించిన భూసేకరణ సమస్యలను గుర్తించి, వారితో చర్చల ద్వారా పరిష్కార మార్గాలను అన్వేషించాలని, నిర్ణీత గడువులోగా భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనుతో కలిసి మండల తహసీల్దార్లతో కలెక్టర్ భూసేకరణ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎత్తిపోతల పథకానికి అవసరమైన భూముల గుర్తింపు, భూసేకరణ ప్రతిపాదనలు, పరిహారం చెల్లింపులు, భూముల సర్వే, పెండింగ్‌లో ఉన్న సమస్యలు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.

**రైతుల సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలి**

భూసేకరణకు సంబంధించి రైతులకు ఎదురవుతున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. భూసేకరణ ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉండటానికి గల కారణాలను విశ్లేషించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా పరిహారం చెల్లింపులు, సర్వే నంబర్లకు సంబంధించిన వివాదాలు, ఇతర భూముల వివరాల్లో ఉన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని ఆదేశించారు. అవసరమైన సందర్భాల్లో సంబంధిత రైతులను పిలిపించి చర్చలు నిర్వహించాలని, వారి అభ్యంతరాలను పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కార మార్గాలను ఖరారు చేయాలని తెలిపారు. భూసేకరణ ప్రక్రియలో అనవసర జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని, ప్రతి అంశంపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు.

**ప్రభుత్వ భూముల వివరాలు సిద్ధంగా ఉంచాలి**

ఎత్తిపోతల పథకానికి అవసరమైన భూములకు సంబంధించి అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములు, ఆక్రమణలు లేని భూములు, భూముల ప్రస్తుత స్థితిగతులు, సర్వే వివరాలపై తహసీల్దార్లు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. భూసేకరణకు అనువైన భూములను ముందుగానే గుర్తించి, అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ ఉన్నతాధికారులు, కేంద్ర ప్రభుత్వ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించే అవకాశం ఉన్నందున, రెవెన్యూ రికార్డులు, సర్వే వివరాలు పక్కాగా ఉండాలని తెలిపారు. భూములకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు నవీకరించుకోవడంతోపాటు, అవసరమైన రికార్డులను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు.

**రేడియల్ రోడ్డు భూసేకరణపై ప్రత్యేక దృష్టి..**

రేడియల్ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ పనులను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. రహదారి నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా భూసేకరణలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి, భూసేకరణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, నిర్ణీత గడువులోగా లక్ష్యాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

**పెండింగ్ అవార్డులు, పరిహారం చెల్లింపులు త్వరగా పూర్తి చేయాలి..**

భూసేకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అవార్డులు, పరిహారం చెల్లింపులు, సర్వేకు సంబంధించిన అంశాలను సమగ్రంగా సమీక్షించి, అవసరమైన ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సర్వే బృందాలు సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, భూసేకరణ సమయంలో ఎదురవుతున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. భూసేకరణ ప్రక్రియలో ప్రతి దశకు సంబంధించి స్పష్టమైన కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగాలని, పెండింగ్‌లో ఉన్న అంశాలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. పనుల పురోగతికి సంబంధించి అధికారులు నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు.

**వచ్చే వారం మరోసారి సమీక్ష**

మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం, రేడియల్ రోడ్డు భూసేకరణ పనుల పురోగతిపై వచ్చే వారం మరోసారి సమీక్ష నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రియాంక వెల్లడించారు. అప్పటిలోగా ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించి, నిర్దేశించిన లక్ష్యాల మేరకు పురోగతి సాధించాలని అధికారులకు స్పష్టం చేశారు. భూసేకరణ పనుల్లో జాప్యం జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ రమేష్, ఏవో అనిల్ కుమార్, భూ సర్వే ఏడీ వేణుగోపాల్ రెడ్డి, నారాయణపేట, ఉట్కూర్, దామరగిద్ద, మద్దూరు, గుండుమల్, కోస్గి మండలాల తహసీల్దార్లు అమరేంద్ర కృష్ణ, అశోక్ కుమార్, తిరుపతయ్య, మహేష్, భాస్కర స్వామి, కళ్యాణితో పాటు సంబంధిత రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



# క్రమబద్ధీకరణ ఎప్పుడు?

## 20 ఏళ్లుగా సేవలు.. ఇంకా క్రమబద్ధీకరణకు నోచుకోని ఒప్పంద అధ్యాపకులు

**హాజరు కానున్న ఎంపి ఆర్ కృష్ణయ్య**

**ఒప్పంద అధ్యాపకుల ఆందోళనకు ఎంపీ సంఘీభావం**

**ముందుగా క్రమబద్ధీకరించాకే ఖాళీల భర్తీ చేపట్టాలని డిమాండ్**

**ధర్నాకు పాలమూరు యూనివర్సిటీ ఒప్పంద అధ్యాపకుల మద్దతు**



మహబూబ్‌నగర్, 14అక్టోబర్,(మనం న్యూస్) : రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం గురువారం ఉన్నత విద్యామండలి కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాకు ఎంపీ ఆర్. కృష్ణయ్య హాజరై సంఘీభావం ప్రకటించనున్నారు. ఈ ధర్నాకు పాలమూరు యూనివర్సిటీ ఒప్పంద అధ్యాపకులు మద్దతు ప్రకటించారు.రెండు దశాబ్దాలుగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తూ యూనివర్సిటీల విద్యా, పరిశోధనాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఒప్పంద అధ్యాపకులను ప్రభుత్వం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. తమ సేవలను గుర్తించి, ముందుగా క్రమబద్ధీకరించిన తర్వాతే మిగిలిన ఖాళీల భర్తీ ప్రక్రియను చేపట్టాలని కోరారు.ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 31 నేపథ్యంలో బుధవారం పాలమూరు యూనివర్సిటీ పీజీ కళాశాలలో నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఈ అంశంపై చర్చించారు. రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకుల సమస్యలను పరిష్కరించిన తర్వాతే నియామక ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని అభిప్రాయపడ్డారు.గతంలో సమ్మె సందర్భంగా ఒప్పంద అధ్యాపకుల పోస్టుల మినహాయింపు విషయంలో హామీ ఇచ్చినా, రాతపూర్వకంగా భరోసా కల్పించలేదని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా పరిమిత వేతనాలతో పనిచేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు యూనివర్సిటీల అభివృద్ధికి తోడ్పడుతున్న తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం నిర్వహించనున్న ధర్నాకు స్వచ్ఛందంగా తరలివెళ్లాలని సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో డాక్టర్ భూమయ్య, సుదర్శన్ రెడ్డి, డాక్టర్ శ్రీధర్ రెడ్డి, డాక్టర్ రవికుమార్, డాక్టర్ ఈశ్వర్ కుమార్, డాక్టర్ జ్ఞానేశ్వర్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ స్వాతి, డాక్టర్ మృదుల, డాక్టర్ శ్రీలత, డాక్టర్ సుజాత, డాక్టర్ సుస్మిత, డాక్టర్ సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## మిడ్జిల్‌లో అక్రమ ఇసుక రవాణా

**జేసీబీ, టిప్పర్ పట్టివేత**

**తూతూ మంత్రంగా పని చేస్తున్న రెవెన్యూ అధికారులు**





మిడ్జిల్ అక్టోబర్ 14 (మనం న్యూస్) : మిడ్జిల్ మండలంలోని మున్ననూర్ గ్రామ శివారులో మంగళవారం రాత్రి 12 గంటల సమయంలో అక్రమ ఇసుక తవ్వకాలపై పోలీసులు దాడి చేశారు. అర్ధరాత్రి జేసీబీతో ఇసుకను టిప్పర్ లోకి నింపుతుండగా పట్టుకున్నారు.పోలీసులు టిప్పర్ (టీఎస్16 యూ 2156) మరియు జేసీబీని సీజ్ చేసి మిడ్జిల్ పోలీస్ స్టేషన్ కు తరలించారు.వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సమాచారం.ప్రతి రోజూ ఒక చోట అక్రమ దందాలు కొనసాగుతూనే ఉన్నాయి. జిల్లా అధికారులు చేసిన ఆదేశాల ...నుసారం ఒకరోజు రెండు ...రోజులు పాటించడం తర్వాత ...మి తెలియనట్టు నిర్లక్ష్యం ...హించడం తో మాఫియాకు ...మళ్ళీ పునర్జీవం పోసుకున్న ...ట్లుగా కొనసాగుతూనే ఉ...న్నాయి. జిల్లా అధికారులు ...గ్రామాల్లో ఉండే ప్రజలను ...చైతన్యవంతులను చేస్తే తప్ప ...ఇలాంటి మాఫియాకు ...అడ్డుకట్ట పడే అవకాశం ...లేదు అంటున్నారు ...చదువుకున్న కొందరు ...మేధావులు.

## ఆపదలో ఆదుకున్న..ఆత్మీయ హస్తం

**కన్నీటి కుటుంబానికి..కల్పతరువులై**

**జకినాలపల్లి మాజీ సర్పంచ్ తలసాని అనిల్ రెడ్డి**

ఊరుకొండ అక్టోబర్ 14 (మనం న్యూస్) : స్థానిక మండల పరిధిలోని బుధవారం రాచాలపల్లి గ్రామంలో గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శ్రీపురం సత్యమ్మ అనారోగ్యంతో అనంత లోకాలకు చేరింది.ఆ ఇల్లాలి మరణంతో ఆ ఇంట్లో విషాద ఛాయలు అలముకున్నాయి.ఇట్టి విషయం స్థానిక కాంగ్రెస్ నాయకులు గంగాపురం శ్రీధర్ రెడ్డి ద్వారా తెలుసుకున్న, జకినాలపల్లి మాజీ సర్పంచ్ తలసాని అనిల్ రెడ్డి.మాటలతో కాదు,చేతలతో నిరూపించారు.మానవత్వం అంటే ఏమిటో,వారి మాటల్లోనే వర్ణించలేనిది.వారి గుండె వెన్న లాంటిది.ఆ కుటుంబానికి 5 వేల ఆర్థిక సహాయాన్ని అందించి,ఆర్థిక ఊరటనిచ్చాడు.పేదరికం అనే పెనుభూతం ఆ ఇంటిని వెంటాడుతున్న వేళ,పేదరికంలో పుట్టెడు దుఃఖం ముంచుకొచ్చిన వేళ,మానవత్వం పరిమళించింది.డబ్బును కాదు,దయను పంచారు.ఆర్థికంగా చేయూతనిచ్చి,ఆ కుటుంబానికి కొండంత భరోసాను కల్పించారు.ఇలాంటి కడగండ్ల కాలంలో కల్పతరువులా నిలిచిన,వారిని గ్రామస్తులంతా మనసారా అభినందిస్తున్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వెంకటయ్య,నరేష్ యాదవ్,నరసింహా,పర్వతాలు, చెన్నయ్య,గ్రామ-స్తులు పాల్గొని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.





## వరికి రూ.4100.. రైతుకు సంతోషం

మాగనూర్ 14(మనం న్యూస్) : నారాయణ పేట జిల్లా మాగనూర్ మండలం అడవి సత్యవర్ గ్రామంలో దుర్గారాజు అనే రైతు పండించిన కె ఎన్ యమ్ 1638 అనే సన్నరకం వడ్లకు 4100 రూపాయలకు ప్రైవేట్ వ్యక్తులు కొనడం చాలా విశేషం. ఎల్ నీనో వలన దిగుబడి తగ్గినా రైతులు ధరలు పెరగడం తో రైతులు సంతోషిస్తున్నారు.





## జర్నలిస్టుల హక్కులపై పోరాటం ఆగదు : టీఎంజేఎఫ్

**హెల్త్ కార్డులు,రక్షణ చట్టం అమలు వరకు పోరాటం**

**టీఎంజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల నాగేందర్ మాదిగ**

**టీఎంజేఎఫ్ జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక**

**జిల్లా అధ్యక్షుడిగా వంగూరు జయశంకర్**

నాగర్ కర్నూల్ మనం న్యూస్, ( అక్టోబర్ 14) : జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, వృత్తిపరమైన భద్రత కోసం తెలంగాణ మాదిగ జర్నలిస్టుల ఫోరం (టీఎంజేఎఫ్) నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల నాగేందర్ మాదిగ స్పష్టం చేశారు. జర్నలిస్టులను అణిచివేయాలని చూస్తే హక్కుల కోసం పోరాడే కొత్త తరం మరింత బలంగా ముందుకొస్తుందని హెచ్చరించారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని దేవకి ఫంక్షన్ హాల్ లో టీ ఎం జే ఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి పంగిడిచెరువు వెంకటేష్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన టీఎంజేఎఫ్ జిల్లా సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్నారని, అలాంటి జర్నలిస్టులకు వృత్తిపరమైన భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. విధి నిర్వహణలో జర్నలిస్టులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దాడులు, బెదిరింపుల నుంచి రక్షణ కల్పించేందుకు సమగ్ర జర్నలిస్టుల రక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రక్షణ చట్టం అమలయ్యే వరకు టీఎంజేఎఫ్ పోరాటం ఆగదని తేల్చి చెప్పారు. ప్రతి జర్నలిస్టుకూ ఆరోగ్య భద్రత కల్పించాలి: అర్హులైన ప్రతి జర్నలిస్టుకూ హెల్త్ కార్డులు మంజూరు చేసి, వారికి, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

**నాగర్ కర్నూల్ జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక**

సమావేశంలో టీఎంజేఎఫ్ నాగర్ కర్నూల్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు: వంగూరు జయశంకర్ ఉపాధ్యక్షులు: సౌటా రాములు, ఎర్రవల్లి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి: డి. రామస్వామి, కోశాధికారి: కావలి పరశు రాములు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు: గిద్ద విజయ్ కుమార్, సి.సుందర్, నూతన కమిటీ సభ్యులకు బూర్గుల నాగేందర్ అభినందనలు తెలిపారు. జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి,అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీఎంజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుబ్బ నాగేష్ ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లె రాజన్న,జంగయ్య,భాస్కర్,సుధాకర్ తో పాటు వివిధ పత్రికల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చారకొండలో 'మెడ్ ప్లస్' స్టోర్ ప్రారంభం

## ప్రారంభించిన దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్



చారకొండ,అక్టోబర్14(మనం న్యూస్) : చారకొండ మండల కేంద్రంలో 'మెడ్ ప్లస్'స్టోర్ అందుబాటులో ఉందని మండల ప్రజలు వినియోగించుకోవాలని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రవీంద్ర కుమార్ అన్నారు. బుధవారం చారకొండ మండల కేంద్రంలో మెడ్ ప్లస్ స్టోర్ ను దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ పాల్గొని స్టోర్ ను ప్రారంభించారు.స్టోర్ నిర్వాహకులు ఆనంద్ మాజీ ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రవీంద్ర కుమార్ మాట్లాడుతూ మెడ్ ప్లస్ స్టోర్ చారకొండ మండల ప్రజలు వినియోగించుకోవాలని,సరసమైన ధరలకు జనరల్,మెడిసిన్ అందుబాటులో ఉంటాయని, హైదరాబాద్ తదితర పట్టణాలకు వెళ్లకుండా రవాణా భారం తగ్గుతుందని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో చారకొండ సింగిల్ విండో చైర్మన్ జెల్ల గురువయ్యగౌడ్,ఎర్రగుంటపల్లి సర్పంచ్ మాల్ రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, దేవరకొండ కౌన్సిలర్ పొట్ట మురళి, మాజీ సర్పంచులు పేట రాధా వెంకటయ్య, లోకసాని శ్రీనివాస్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ రఘు,మాల్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు చారకొండ శివ, ఆరేళ్లపర్వతాలు గౌడ్, పల్చ వెంకటయ్య గౌడ్, ఖలీల్, శ్రీకాంత్తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ మహా చండీ దేవిగా దుర్గమ్మ దర్శనం

## అమ్మవారికి ప్రత్యేక పూజలు

గోపాలపేట అక్టోబర్ 14 :(మనంన్యూస్) : మండలం చాకలి పెల్లిగ్రామం లో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. నాలుగో రోజు బుధవారం అమ్మవారు శ్రీ మహ చండీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అమ్మవారికి గ్రామ ఉప సర్పంచ్ దూడోల్ల ఎల్లమ్మ ఏసోబు అమ్మవారికి చండీ అవతారం అలంకరించి నైవేద్యం సమర్పించి పండితులతో వేదమంత్రాలతో అంగరంగ వైభవంగా ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకి తీర్థ ప్రసాదాలు అందించారు కాలనీవాసులు, గ్రామ ప్రజలు గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జగన్మాత సన్నిధిలో జననేత

## ప్రజాసేవలో..సరికొత్త మలుపు

## రాష్ట్ర భాజపా నాయకుడు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి



ఊరుకొండ అక్టోబర్ 14( మనం న్యూస్) : స్థానిక మండల కేంద్రంలో బుధవారం స్థానిక సర్పంచి మేకల మంజుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో,ఆధ్యాత్మికతకు,నిలయం అనంత శక్తి స్వరూపిని.అయిన దుర్గామాత దివ్య సన్నిధిలో రాష్ట్ర పార్టీ అగ్రనేత నిరంతర ప్రజాసేవకుడు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా సంభాషిస్తూ లలితాంబ చరణారవిందాలను దర్శించి, లోక కళ్యాణం కొరకు, నియోజకవర్గ ప్రజల సుఖ,సంతోషాల కొరకు ఆయన అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు.భక్తితో మొదలైన,ఈ అడుగు రేపటి ప్రజా సేవకు దివ్యమైన దారి కానుంది. సమస్యల వలయంలో ఉన్న, నియోజకవర్గాన్ని సమున్నత ప్రగతి పతంలో నడపడం కోసం, ఇదే మనం ముచ్చర్ల వారి ఆశయం. రేపటి విజయానికి ఇదే అసలైన పునాది.రాజకీయం అంటే కేవలం ఎన్నికల సమరమే కాదు, అది ప్రజల జీవితంలో వెలుగులు నింపే ఒక పవిత్ర యజ్ఞం. ముచ్చర్ల జనార్దన్ రెడ్డి నాయకత్వం కేవలం, ఒక ఆశాకిరణం కాదు.నియోజకవర్గ ప్రగతికి ఒక భరోసా.కాబోయే శాసన సభ్యుడిగా, ఆయన అడుగులు శాసనసభ వైపు మాత్రమే కాదు,ప్రతి ఒక్క పేదవాడి గుండె వైపు సాగుతున్నాయి.దుర్గామాత అనుగ్రహం ,ప్రజల అచంచల విశ్వాసంతో ఆయన విజయకేతనం ఎగరవేయడం థత్యమని, ఈ ఆధ్యాత్మిక వేడుక సాక్షిగా స్పష్టం అవుతుంది.

### విజయ గీతికా..ప్రగతి ప్రతీక

అమ్మవారి దివ్య మంగళస్వరూపం, ఆయనకు మరింత, ఆత్మస్థైర్యాన్ని సేవ చేయాలనే దృఢ సంకల్పాన్ని ప్రసాదించింది. సత్యమే శరణ్యంగా ధర్మమే మార్గంగా సాగుతున్న జనార్దన్ రెడ్డి రాజకీయ యాత్ర రేపటి నియోజక వర్గ భవిష్యత్తుకు నూతన జవజీవాలు పోస్తుందనలో ఇలాంటి అతియో శక్తి లేదనిపిస్తుంది. ఈ కార్యక్రమంలో భాజపా స్థానిక నాయకులు కొమ్ము శ్రీనివాస్,మున్న,గోపి,బండి మల్లేష్,ఉపాధ్యాయుడు సాయి,చరిత్ర అధ్యాపకుడు సదానందం గౌడు,స్థానిక యువకులు పాల్గొన్నారు.



# భూముల రీ సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలి : ఆర్డీఓ సుబ్రహ్మణ్యం

కొత్తకోట, అక్టోబర్ 14 (మనం న్యూస్): రైతులకు ప్రస్తుతం ఉన్న భూ సమస్యలు పరిష్కారంతో పాటు భవిష్యత్తులో సమస్యలు రాకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీ సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయాలని ఆర్డీఓ సుబ్రహ్మణ్యం సర్వేయర్లను ఆదేశించారు.బుధవారం కొత్తకోట మండలం పాత జంగమాయపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న సమగ్ర భూ రీ సర్వే ప్రక్రియను ఆయన పరిశీలించారు. సర్వేను చాలా పకడ్బందీగా నిర్వహించాలని, రైతులకు ముందస్తు సమాచారం ఇచ్చి వారి సమక్షంలో సర్వే చేసే విధంగా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు.గ్రామస్తులు, రైతులతో మాట్లాడిన ఆర్డీఓ, రీ సర్వే ద్వారా ప్రస్తుతం ఉన్న భూ సమస్యలు పరిష్కారమవుతాయని, రానున్న కాలంలో రైతులకు ఎలాంటి భూ సమస్యలు లేకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ సర్వేను చేపడుతోందని తెలిపారు. అందువల్ల రైతులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఆర్డీఓ వెంట తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆటల తోటలో..పథకాల వేట

## వాలీబాల్ కోర్టులో..స్వర్ణ కేతనం

